సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



జపాన్‌కు టీటీ ఆటగాళ్లు

పదిరోజుల పాటు జపాన్ ఆటగాళ్ల టెక్నిక్, మెళకువల్ని నేర్చుకునేందుకు నలుగురి టేబుల్‌టెన్నిస్ ఆటగాళ్లను ఎంపిక చేశారు. 8లో



అమ్మకు నీరాజనం

అనకాపల్లిలో నూకాంబిక ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచే క్యూలైన్లు నిండిపోయాయి. 8లో



గ్రామాల్లో సందడే సందడి

ఏజెన్సీ ప్రాంతంలో ఇటుకల పండగ సందడి నెలకొంది.మైదాన ప్రాంతంలో ఉగాది మాదిరిగానే మన్యంలో నిర్వహిస్తారు. 8లో

రంజాన్ వేళలు

అరకు/పాడేరు:
ఇఫ్తార్ (సోమ) 6-12 సహర్ (మంగళ) 4-28

రంపచోడవరం:
ఇఫ్తార్ (సోమ) 6-27 సహర్ (మంగళ) 4-31

న్యూస్‌రీల్

భీమలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు

దర్శించుకున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దంపతులు



భీమలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దంపతులు

పాడేరు: హుకుంపేట మండలం ఉక్కుర్బలోని భీమలింగేశ్వరస్వామివారిని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు దంపతులు దర్శించుకున్నారు. గిరిజనులంతా తమ సంప్రదాయ ప్రకారం వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం శివలింగానికి వారు ప్రత్యేక పూజలు చేశారు.బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన శివలింగాల ప్రదర్శనను వారు సందర్శించారు.ఆలయ సంప్రదాయ ప్రకారం సమరసత ఫౌండేషన్ ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ రాధాకృష్ణ, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు లకే చిట్టిబాబు, ఇతర గిరిజనులంతా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, డాక్టర్ నర్సింగరావు దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

మన్యంలో కొనసాగుతున్న వర్షాలు



పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో కురుస్తున్న భారీ వర్షం

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో రోజూ వర్షాలు కురుస్తున్నాయి.మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఉంటున్నప్పటికీ ఒక్కసారిగా వాతావరణ చల్లబడి వర్షం కురుస్తోంది. ఆదివారం సాయంత్రం పాడేరుతో పాటు సమీప ప్రాంతాల్లో గంట పాటు భారీ వర్షం కురిసింది.జనజీవనానికి అంతరాయం ఏర్పడింది.రోజు కురుస్తున్న వర్షాలు రబీలో వరి,కూరగాయల పంటలకు మేలు చేస్తుండగా,వేసవి దుక్కులకు అనుకూలమని జిల్లా వ్యవసాయాధికారి నందు తెలిపారు.

కేజీహెచ్ ఎస్టీ సెల్ ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న పాడేరు డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా

మహారాణిపేట: కింగ్ జార్జి ఆస్పత్రిలో ఉన్న ట్రైబల్ సెల్ (ఎస్టీ)ను ఆదివారం అల్లూరి సీతారామరాజు (ఏఎస్సార్) జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జమాల్ బాషా ఆకస్మికంగా సందర్శించి, రికార్డులను పరిశీలించారు. అనంతరం డ్యూటీలో ఉన్న సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. ఎంత మంది గిరిజన రోగులు ఉన్నారు.. వైద్య సేవలు ఎలా అందుతున్నాయన్న దానిపై అడిగి తెలుసుకున్నారు. పాడేరు నుంచి ఒక న్యూరో కేసు రావడంతో ఆ కేసు కోసం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్, ఇతర వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

గీతాభవన్‌లో విద్యాప్రకాశ నందగిరి జయంతి

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): వన్‌టౌన్ రాజ ప్పనాయుడు వీధిలో గల గీతాభవన్‌లో గీతాప్రచార సమితి ఆధ్వర్యంలో విద్యాప్రకాశనంద గిరి స్వామి జయంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి భక్తులనుద్దేశించి మాట్లాడారు. శ్రీకృష్ణ పరమాత్ముడు ప్రసాదించిన భగవద్గీత సారాంశాన్ని తన ప్రసంగం ద్వారా భక్తులకు బోధించి తన పరిపూర్ణ జీవితాన్ని భగవద్గీతకు అంకితం చేసిన మహనీయుడు విద్యాప్రకాశనందగిరి అని అన్నారు.

గిరిజనులే స్వచ్ఛమైన భక్తులు

- శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రసరస్వతిస్వామి
- మోదమ్మ, స్వయంభూ భీమలింగేశ్వర స్వామి ఆలయాల సందర్శన
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో గిరిజనుల ఘన స్వాగతం



ఉక్కుర్బలో విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామికి గిరిజన సంప్రదాయ ప్రకారం బొట్టు పెట్టి స్వాగతం పలుకుతున్న మహిళలు



శివలింగాల ప్రదర్శనను తిలకిస్తున్న స్వాత్మానందేంద్రసరస్వతిస్వామి తదితరులు

సాక్షి, పాడేరు: పవిత్రమైన మన్యంలో గిరిజనులే స్వచ్ఛమైన దైవభక్తులని, అయోధ్యలో ఉండే రామచంద్ర ప్రభువు వనవాసంలో గిరిజనులతో కలిసి జీవించడమే ఇందుకు నిదర్శనమని విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రసరస్వతిస్వామి అన్నారు. ఆదివారం ఆయన పాడేరులోని మోదకొండమ్మతల్లి, హుకుంపేట మండలంలోని ఉక్కుర్బ స్వయంభూ భీమలింగేశ్వర స్వామి ఆలయాలను సందర్శించారు. మోదకొండమ్మతల్లి ఆలయంలో ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యంతో పాటు రామకృష్ణ పరమహంస ఆధ్వర్యంలో గిరిజన పూజారులు పూర్ణకుంభంతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులంతా పూలమాలలతో సత్కరించారు. అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. హుకుంపేట మండలం ఉక్కుర్బలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో గిరిజనులంతా ఆచార, సంప్రదాయ ప్రకారం ఘన స్వాగతం పలికారు. స్వామికి గిరిజన మహిళలు కాళ్లు కడిగి ఆశీర్వాదం పొందారు. పూలతో ఆలయం వరకు స్వాగతం పలికారు. అనంతరం భీమలింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధులు ఏర్పాటు చేసిన శివలింగాల ప్రదర్శనను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నృత్య ప్రదర్శనలు చేసిన గిరిజన యువతులను స్వామి అభినందించారు.

పరమతాల ఉచ్చులో పడొద్దు

గిరిజనులంతా అన్యమతాల ప్రలోభాలకు లొంగి, పరమతాల ఉచ్చులో పడొద్దని స్వాత్మానందేంద్రసరస్వతిస్వామి కోరారు. ఉక్కుర్బలోని గిరిజనులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో హైందవ ధర్మానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. దేవతామూర్తులు నడయాడిన పర్వతాలను పరమ పవిత్రంగా గిరిజనులు చూసుకోవడం ఆదివాసీల అదృష్టమన్నారు. గిరిజన ప్రాంతాల పర్యటన అంటే ఎంతో అభిమానమన్నారు. ఉక్కుర్బ దేవాలయానికి గత ఏడాది కాలినడకన మట్టిరోడ్డులో వచ్చానని, ఏడాదిలో ఆలయం అభివృద్ధి చెందడం, సిమెంటు రోడ్డుతో వాహనంలో నేరుగా ఆలయానికే చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి కృషి

శారదా పీఠం ద్వారా ఆలయ ప్రాంగణంలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి తమ పీఠాధిపతి భక్తులతో మాట్లాడి తగిన న్యాయం చేస్తామని స్వాత్మానందేంద్రసరస్వతిస్వామి హామీ ఇచ్చారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ భీమలింగేశ్వరస్వామి ఆలయానికి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ఎంత ఖర్చయినా వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో శారదా పీఠం ద్వారా ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడుతుండడం సంతోషంగా ఉందన్నారు. గిరిజనుల సేవలో నిత్యం ముందుంటున్న విశాఖ శారదా పీఠానికి గిరిజనులమంతా రుణపడి ఉంటామన్నారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు, ఎమ్మెల్యే పాల్గుణ స్వాత్మానందేంద్రసరస్వతిస్వామిని ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు లకే చిట్టిబాబు, ఎంపీటీసీ భీమలింగేశ్వరరావులను శాలువాతో ఘనంగా సన్మానించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ రాధాకృష్ణ.ఆలయ కమిటీ ప్రతినిధులు, తడిగిరి పంచాయతీ గిరిజనులు పాల్గొన్నారు.



స్వాత్మానందేంద్రసరస్వతిస్వామికి జ్ఞాపికను అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



గిరిజనుల సమావేశంలో మాట్లాడుతున్న స్వాత్మానందేంద్రసరస్వతిస్వామి

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- కిండలంలో మృతుల కుటుంబాలకు పరామర్శ
- మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని సూచన
- ముగ్గురికి వైఎస్సార్ బీమా వర్తింపు



బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ, పార్టీ నేతలు

పెదబయలు: ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. ఆదివారం మండలంలోని మారుమూల కుంతుర్ల పంచాయతీ కిండలంలో ఇటీవల మరణించిన ఏడు బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. సాధారణ మరణాలే అయినా ఒకే గ్రామంలో ఏడుగురు మృతి చెందడం బాధాకరమన్నారు. వైద్యాధికారులకు అప్రమత్తం చేసి రెండు వారాల నుంచి నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నట్టు ఆయన తెలిపారు.గ్రామస్తుల్లో ఎక్కువ మందిలో హైపర్ టెన్షన్ ఉన్నట్టు వైద్యాధికారులు గుర్తించారన్నారు. అందుకుతగ్గట్టుగా ఇస్తున్న మందులను క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. మృతుల్లో కిముడు బోడంనాయుడు, వంచ రంగి రామన్నదొర, కునెబేరి ఈశ్వరమ్మ వైఎస్సార్ బీమా వర్తిస్తుందన్నారు. ఒకొక్క కుటుంబానికి రూ. లక్ష చొప్పున వర్తిస్తుందన్నారు. తక్షణ సహాయంగా మృతుల కుటుంబాలకు సంబంధించి కుటుంబ సభ్యుల ఖాతాల్లో రూ.10 వేల చొప్పున జమ అవుతుందని తెలిపారు.రేపటి నుంచి విద్యార్థులందరిని బడికి పంపాలని తల్లిదండ్రులను కోరారు. బడికి రాకపోతే వారికి జగనన్న గోరుముద్ద పథకానికి దూరం అవుతారన్నారు.

నిత్యావసరాల పంపిణీ

మృతులకు సంబంధించి ఏడు కుటుంబాల్లో ఒకొక్క దానికి 20 కిలోల బియ్యం, 5లీటర్ల ఆయిల్, 2 కిలోల బంగాళదుంపలు, రెండు కిలోల కందిపప్పు, రెండు కిలోల టమాటాను ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. గ్రామంలో కింది వీధికి సీసీ రోడ్డు మంజూరు చేయాలని, పాఠశాలను నాడు–నేడులో చేర్చాలని, గ్రామాన్ని సమీప గోమంగి పీహెచ్‌సీ పరిధిలో చేర్చాలని, అంగన్‌వాడీ భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, మండల పార్టీ అధ్యక్షుడు వంతాల ఆనందరావు, ఆర్‌ఐ కిరణ్‌కుమార్, వీఆర్వో నవీన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ, సీపీఐ నేతలు పాల్గొన్నారు.

జ్ఞానసాగర్ సత్యనారాయణకు కన్నీటి వీడ్కోలు



డీవీ సత్యనారాయణ భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న నర్సింగరావు

సాక్షి, పాడేరు: గిరిజన ప్రాంతాల్లో జ్ఞానసాగర్ స్వచ్ఛందసంస్థ, బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శాఖల వ్యవస్థాపకుడు డీవీ సత్యనారాయణ భౌతికకాయానికి ఆదివారం పాడేరులో బ్రహ్మకుమారీలు, అన్నివర్గాల ప్రజల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయ భవనంలో ఉంచిన ఆయన భౌతికకాయానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు శ్రద్ధాంజలి ఘటించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. స్థానిక శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ సంతాపం తెలిపారు.

విస్తృతంగా కోవిడ్ పరీక్షలు

నేటి నుంచి రోజుకు 200 మందికి ..

మహారాణిపేట: విశాఖలో కరోనా కేసులు రోజు రోజుకూ పెరుగుతుండడంతో పరీక్షల సంఖ్య పెంచాలని నిర్ణయించారు. ప్రస్తుతం జిల్లాలో రోజుకు 50 పరీక్షలు చేస్తున్నారు. ఈ సంఖ్యను 200 పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. లక్షణాలు కలిగిన వారికి పరీక్షలు చేయాలని నిర్ణయించారు. జ్వరం, దగ్గు, తలనొప్పి, ఇతర లక్షణాలు ఉంటే తక్షణం పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. 3 కమ్యూనిటి హెల్త్ సెంటర్లు, 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 63 పట్టణ ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీఎస్) సోమవారం నుంచి రోజుకు 200 మందికి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. అలాగే వైఎస్సార్ హెల్త్ కేర్ సెంటర్‌లో కూడా పది కిట్లు సిద్ధంగా ఉంచుతున్నారు.

నేటి నుంచి మాక్ డ్రిల్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారు.

12 కరోనా కేసులు నమోదు

విశాఖలో ఆదివారం 12 కరోనా కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 114 మందికి పరీక్షలు నిర్వహించారు. మొత్తం కరోనా సోకిన వారి సంఖ్య 32కు చేరుకుంది. వీరిలో ఏడుగుర్ని డిశ్చార్జ్ చేశారు. మిగిలిని వారు చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌వో వివరించారు.

మూడోరోజు ఉత్సాహంగా..

విజయవంతంగా 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్'



మినుములూరులో పథకాల బ్రోచర్‌ను మహిళలకు అందజేస్తున్న గృహ సారథులు

సాక్షి,పాడేరు: జిల్లాలో జగనన్నే మా భవిష్యత్తు, మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మూడవ రోజు ఆదివారం ఉత్సాహంగా జరిగింది. పాడేరు, అరకులోయ, రంపచోడవరం ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులాపల్లి ధనలక్ష్మి పర్యవేక్షణలో సచివాలయాల కన్వీనర్లు,గృహసారథులు, వలంటీర్లు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లారు. ప్రభుత్వ పథకాలను సమగ్రంగా వివరించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరుపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. వారి ఆమోదంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఫొటోతో కూడిన స్టిక్కర్లను ఇంటి తలుపులపై అంటించారు.

పంపిణీకి సిద్ధంగా పొగరాని పొయ్యిలు

ఒకటి రూ.250



పొగరాని పొయ్యి

రాజవొమ్మంగి: క్రాప్ జోన్ ఆగ్రోఫారెస్ట్ సంస్థ రూ. 250లకే పొగరాని పొయ్యి అందజేస్తోంది. ఆదివారం మండలానికి 1600 పొయ్యిలు వచ్చాయి. వీటిని స్థానిక వ్యవసాయపరపతి సంఘం వద్ద భద్రపరిచారు. ఈ పొయ్యి విలువ రూ. 4వేలు కాగా నామమాత్ర ధరకు గిరిజన కుటుంబాలకు అందజేస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ రమేష్ తెలిపారు. బేస్‌లైన్ సర్వే పూర్తయిన తరువాత ఈ పొయ్యిలను మరో 20 రోజుల్లో లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. వంట చెరకు పేరుతో అంతరించిపోతున్న అడవులను కాపాడటం, వాతావరణంలో ఆక్సిజన్‌ను పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో ఈ పొయ్యిలు దేశ రాజధానిలో తయారైనట్లు తెలిపారు. మండల కోఆర్డినేటర్ మిరియాల సత్యనారాయణ పాల్గొన్నారు.

గండిపోశమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి సుజాత

దేవీపట్నం : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి వి. సుజాత గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం కుటుంబసభ్యులతో కలసి అమ్మవారి ఆలయానికి ఆమె చేరుకున్నారు. దేవాదాయశాఖ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికి సాదరంగా ఆహ్వానించారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఫస్ట్‌క్లాస్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ ప్రవీణ్ భాంజ్ డియో, ఎండోమెంట్ అధికారులు పాల్గొన్నారు.

కేటీబీ కళాక్షేత్రం ప్రారంభం



కళాక్షేత్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్‌లో నేవల్ డాక్ యార్డు కాపు తెలగ బలిజ (కేటీబీ) అసోసియేషన్ నూతనంగా నిర్మించిన కళాక్షేత్రాన్ని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నావెల్ డాక్ యార్డు ఉద్యోగులంతా కలిసి సొంతంగా ఈ కళాక్షేత్రాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ప్రభుత్వ విప్ కరణ ధర్మశ్రీ మాట్లాడుతూ ఉద్యోగుల సమష్టి కృషితో ఈ విధంగా సొంత భవనం ఏర్పాటు చేసుకోవడం బాగుందని కొనియాడారు. సంఘ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, ఎమ్మెల్యే గణబాబు, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల చిరంజీవి, భాస్కరరావు, బీజేపీ నేత పృథ్వీరాజ్, కార్పొరేటర్ బొమ్మిడి రమణ పాల్గొన్నారు.

మతం మారితే ఎస్టీల్లోంచి తొలగించాలి

- జనజాతి సురక్ష మంచ్ ఆధ్వర్యంలో గిరిజనుల డిమాండ్
- ఢిల్లీ స్థాయిలో ఉద్యమం: అదిలాబాద్ ఎంపీ సోయం బాబూరావు



సభకు హాజరైన గిరిజనులు



మాట్లాడుతున్న అదిలాబాద్ ఎంపీ సోయం బాబూరావు

పాడేరు రూరల్: మతం మారిన గిరిజనులను ఎస్టీ జాబితాలో తొలగించాలని, వారికి రిజర్వేషన్లు వర్తింపజేయవద్దని గిరిజనులు డిమాండ్ చేశారు. జనజాతి సురక్ష మంచ్ ఆధ్వర్యంలో ఆదివారం పాడేరు పట్టణంలో తలార్‌సింగి గౌతమి పాఠశాల నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, సినిమాహాల్ సెంటర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సుండ్రుపుట్టు, మెయిన్ బజార్, పాత బస్టాండ్ మీదుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదిలాబాద్ ఎంపీ సోయం బాబూరావు మాట్లాడారు. మత మారిన గిరిజనులకు ఎస్టీ జాబితాలో తొలగించాలని ఢిల్లీ స్థాయిలో ఉద్యమం చేస్తామన్నారు.

బిర్సాముండా, కొమరం భీం, మల్లుదొర, గంటందొర వంటి గిరిజన పోరాట వీరుల త్యాగాలను ఆదర్శంగా తీసుకొని పోరాటాలు సాగించాలన్నారు. మతం మారిన గిరిజనులకు రిజర్వేషన్లు వర్తింపజేయకుండా చట్టం తేవాలని దేశ ప్రధానికి ప్రతీ గిరిజనుడు లేఖలు రాయాలన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గిరిజన ఐక్యవేదిక జాతీయ గౌరవ అధ్యక్షుడు కె. నాగు, అఖిల భారత గిరిజన ఐక్య వేదిక అధ్యక్షుడు వివేక్‌నాయక్, ఐక్య వేదిక అఖిల భారతీయ సంఘటణ మంత్రి సూర్యనారాయణ, సద్గురు సేవా ఆశ్రమం వ్యవస్థాపకుడు సాయిరాం స్వామీజీ, బలిఘట్టం ఉత్తరవాహిని ఆశ్రమం వ్యవస్థాపకుడు రామనంద స్వామిజీ, జనజాతి సురక్ష మంచ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాకూరు కరుణాకర్, జనజాతి సురక్ష మంచ్ రాష్ట్ర కార్యదర్శి ఉబ్బేటి నాగేశ్వరరావు, గిరిజన ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిముడు దేవి తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన బొడ్డు సంబరం

- ఇటుకల పండగలో భాగంగా నిర్వహణ
- థింసా, గొడుగుల నృత్యాలతో సందడి
- జనసంద్రమైన పాత పాడేరు



పాత పాడేరు గ్రామచావిడిలో బడ్డు సంబరానికి పోటెత్తిన గిరిజనులు



బడ్డు తాడుకు పూజలు చేస్తున్న గిరిజన పెద్దలు

సాక్షి,పాడేరు: ఇటుకల పండగలో పాత పాడేరు గిరిజనులు మాత్రమే నిర్వహించే బడ్డు సంబరం ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. జిల్లాతోపాటు, మైదాన ప్రాంతాల్లోని గిరిమహిళలు భారీగా తరలిరావడంతో పాతపాడేరు కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి ఆధ్మాత్మిక వాతావరణం నెలకొంది. గిరిజనులు ఇళ్లల్లో పూజలు అనంతరం గ్రామదేవత శంకులమ్మ తల్లికి గిరిజన పూజారులంతా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామశివారు కొండపై కొలువుదీరిన పలు పురాతన దేవతామూర్తుల విగ్రహాలకు కూడా పూజలు చేశారు.అక్కడ నుంచి గిరిజన మహిళలంతా థింసా నృత్యాలతో గ్రామ చావడి వరకు ఊరేగింపుగా వచ్చారు.సుమారు రెండు గంటల పాటు పోటాపోటీగా థింసా, గొడుగుల నృత్యాలతో హోరెత్తించారు. గిరిజన మహిళలు పలు వేషధారణల్లో సందడి చేశారు. ఓవైపు వర్షం కురుస్తున్నప్పటికి బడ్డు సంబరాన్ని గిరిజనులు ఉత్సాహంగా జరుపుకున్నారు.

ఊరి మహిళలదే విజయం

బడ్డుతాడు లాగే సంబరంలో ఈ ఏడాది కూడా ఊరిలోని మహిళలే విజయం సాధించారు. ఊరి నుంచి వివాహాలు చేసుకుని మెట్టినింటికి వెళ్లిన ఆడపిల్లలు మాత్రం ఓటమి చెందారు. బడ్డుతాడు లాగే సంబరం అంబరాన్ని తాకింది. ఇటీవల అడవిలో సేకరించిన బడ్డు తాడ్లను గ్రామ చావడి సమీపంలోనే కట్టి గ్రామపెద్దలంతా ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఈ బడ్డు తాడు లాగే సంబరం ఉత్సాహంగా జరిగింది. గ్రామంలోని గిరిజన మహిళలు, ఊరు నుంచి వివాహాలు చేసుకుని మెట్టినింటికి వెళ్లి గిరిజన మహిళలు వేర్వేరుగా ఈ బడ్డుతాడును పోటా పోటీగా లాగారు. ఈ సంబరం ఏటా అత్యంత కనువిందు చేస్తుంది. చివరకు గ్రామంలోని మహిళలే బడ్డుతాడును లాక్కుపోయి విజయం సాధించారు. వరుసగా రెండేళ్లుగా ఊరి ఆడపిల్లలే విజయం సాధిస్తున్నారు.ఈ సంబరం అనంతరం మరల థింసా నృత్యాలు హోరెత్తాయి. సాయంత్రం నుంచి గిరిజన నివాస గృహాల్లో విందు భోజనాల కార్యక్రమాలతో మరింత సందడి నెలకొంది. ఈ బడ్డు సంబరాన్ని వీక్షించేందుకు పాతపాడేరుకు భారీగానే అన్ని వర్గాల ప్రజలు చేరుకున్నారు.



థింసా నృత్యాలు చేస్తున్న మహిళలు

క్లుప్తంగా

జపాన్‌కు టీటీ ఆటగాళ్లు

విశాఖ స్పోర్ట్స్: పదిరోజుల పాటు జపాన్ ఆటగాళ్ల టెక్నిక్, మెళకువల్ని నేర్చుకునేందుకు నలుగురి టేబుల్‌టెన్నిస్ ఆటగాళ్లను ఎంపిక చేశారు. బాలికల విభాగంలో కాజోల్ సునర్, ఫాల్గుణ్‌చార్వి, బాలుర విభాగంలో సూర్యతేజ, వెంకటకార్తికేయలను శిక్షణకు పంపనున్నారు. వీరంతా ఇటీవల స్వర్ణభారతి స్టేడియంలో జరిగిన అంతరజిల్లాల టీటీ పోటీల్లో సత్తాచాటారు. రోటరీ విశాఖ వ్యాలీ,ఎల్ ఏంజిల్ ఇంటర్నేషనల్ వాలంటీర్స్ సంఘం, జపాన్ సంయుక్త ఆధ్వర్యంలో వీరంతా ఈనెల 20వ తేదీన బయలుదేరనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రోటరీక్లబ్ విశాఖ వ్యాలీ రోటేరియన్లు జానకీరామ్, పాండురంగారావు, హనుమంతరావు పాల్గొన్నారు.

అమ్మకు నీరాజనం

అనకాపల్లిటౌన్: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య జాతరలో భాగంగా మూడో ఆదివారం ఉమ్మడి విశాఖ జిల్లా, విజయనగరం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం చుట్టూఉన్న చలువ పందిళ్లలో కుటుంబ సమేతంగా వంటకాలు తయారు చేసి, అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి, భోజనాలు చేశారు. కొంతమంది భక్తులు తమ ఇళ్ల వద్ద శనివారం రాత్రి అమ్మవారిపాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. క్యూలైన్లన్నీ తెల్లవారు జామునుంచి సాయంత్రం వరకూ రద్దీగా ఉన్నాయి.ప్రత్యేక దర్శనం, ప్రముఖుల క్యూలైన్లు కూడా రద్దీగా ఉన్నాయి. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించడంతో పాటు, బాలింతలు పిల్లలకు పాలు ఇచ్చేందుకు ప్రత్యేక రూమ్‌లు ఏర్పాటు చేశారు.

గ్రామాల్లో సందడే సందడి

- మన్యంలో ఘనంగా ఇటుకల పండగ
- థింసా నృత్యాలతో హోరెత్తిస్తున్న గిరిజనులు



అమ్మతల్లి పండుగ నిర్వహిస్తున్న గ్రామస్తులు

అనంతగిరి: ఏజెన్సీ ప్రాంతంలోని ఇటుకల పండగ సందడి జోరుగా సాగుతోంది. మైదాన ప్రాంతాల్లో ఉగాది చేస్తే, గిరిజన ప్రాంతంలోని గిరిజనులు ఇటుకల పండగను ఆచరిస్తారు. పూర్వీకుల ఆచార సంప్రదాయాల అనుగుణంగా గిరిజనులు ఇటుకల పండగను ఘనంగా జరుపుకుంటున్నారు.. ఈ పండగ ఆయా ప్రాంతాలను బట్టి నెల రోజులు పాటుగా, మరికొన్ని ప్రాంతాల్లో రెండు వారాలు పాటుగా పండగను నిర్వహిస్తుంటారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో పండల చివరి దశకు చేరుకోగా, మరికొన్ని చోట్ల కొనసాగుతోంది. కుటుంబ సమేతంగా ఈ పండగను జరుపుకోవడం గిరిజనులకు ఆనవాయితీగా వస్తోంది.

ఓ వైపు పరుషులు వేటకు వెళితే... మహిళలు ప్రధాన రహదారుల వద్ద కర్రతో తాత్కాలిక టోల్ గేట్‌లను ఏర్పాటు చేసి వాహనచోదకుల నుంచి తాచేరు వసూలు చేస్తారు. పురుషులు వేటాడి తెచ్చిన మాంసంతో వంటకాలు చేసి గ్రామస్తులంతా ఒకచోటకు చేరి, భోజనాలు చేస్తారు. సాయంత్రం నుంచి గ్రామాల్లో గిరిజనులు థింసా నృత్యాలతో హోరెత్తిస్తారు. అరకు విశాఖ ప్రధాన రహదారిలోని గేట్లు ఏర్పాటు చేసి, గిరిజన మహిళలంతా సుంకం వసూలు చేస్తున్నారు. థింసా నృత్యాలతో సందడి చేస్తున్నారు.



ఇటుకల పండగ ముగింపు నేపథ్యంలో బొర్రారోడ్డులోని థింసా నృత్యాల్లో పాల్గొన్న పర్యాటకులు

పర్యాటకుల సందడి

అనంతగిరి: అనంతగిరి మండలంలోని టోకూరు పంచాయతీ గ్రామంలోని ఇటుకల పండగ ముగింపు నేపథ్యంలోని గిరిజనులు పెద్ద ఎత్తున థింసా నృత్యాలతో సందడి చేశారు. టోకూరు నుంచి సిసా గుడ మీదుగా బొర్రా రోడ్డు వరకు థింసా నృత్యాలను గిరిజనులు వేశారు. ఆదివారం కావడంతో బొర్రా రహదారిలోని గుహలను తిలకించేందుకు వచ్చిన పర్యాటకులు గిరిజనులతో థింసా నృత్యాలను వేసి సందడి చేశారు.

భక్తిశ్రద్ధలతో అమ్మతల్లి పండగ

జి.మాడుగుల: జిల్లాలో గిరిజన సంప్రదాయంగా గంగన్నమ్మతల్లి దోషం(అమ్మతల్లి దోషం)పండుగను భక్తిశ్రద్ధలతో గిరిజనులు నిర్వహించి ఇటుకల పండుగకు శ్రీకారం చుట్టారు. ఏటా ఏప్రిల్ నెలలో గిరిజన గ్రామ పూజార్లు, పెద్దలు కలసి అమ్మతల్లి దోషం పండుగ మూహూర్తాన్ని నిర్ణయిస్తారు. ఆ రోజున గ్రామంలో వ్యవసాయ, కూలీల ఇతర పనులు చేయకుండా ఉండడం ఆచారం. జి.మాడుగుల మండల కేంద్రంలో ఆదివారం గంగన్నమ్మతల్లి దోషం పండుగ భక్తిశ్రద్ధలతో ఇక్కడ గిరిజన ప్రజలు నిర్వహించారు. గ్రామ పూజారి సూచన మేరకు వై.ఆకారంలో డోలాకర్రకు ఒక బుట్ట కట్టి గ్రామంలోని ఇళ్ల గదుల్లో నుంచి సేకరించిన చెత్త , వాడేసి చీపురుకట్ట, చికిగిన జిబ్బులో వేసి ఆగరబత్తి ధూపాలతో గిరిజన మహిళలు నుంచి సేకరిస్తారు. గ్రామంలో సేకరించిన ఆయా వస్తువులను గ్రామ పోలిమేరల్లో విడిచి గిరిజన సంప్రదాయ పూజలు నిర్వహించారు. కోడిపిల్ల, ఊరపంది పిల్లను, మేకలతో పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఇలా అమ్మతల్లి దోషం చేయటం వలన గ్రామంలో దోషాలు, భూత, పిచాచీలు తొలగి ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని నమ్మకం. అమ్మతల్లి దోషం పండుగలో వరసైన వారిపై నీళ్లు చల్లి మహిళలు సందడి చేశారు. గ్రామ పోలిమేర వడ్లేరులంక మామిడి వద్ద గిరిజనులు వంటలు చేసుకొని సహపంక్తి భోజనాలు చేసి సందడి చేసారు. దీంతో గ్రామంలో ఇటుకుల పండుగ ప్రారంభమయింది. వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మత్స్యరాస మత్స్యరాజు, గ్రామ పెద్దలు వరహాలరాజు, సన్యాసిరాజు, మాజీ ఎంపీపీ వెంకటగంగరాజు, సొలభం సర్పంచ్ ఐసరం హనుమంతరావు, ఎం .భగవాన్‌రాజు, రామచంద్రరాజు, సింహచలం రాజు తదితరలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సంప్రదాయం

ఇటుకల పండగ పూర్వీకులు నుంచి వస్తున్న సంప్రదాయం. దీనిని గిరిజనులంతా సంప్రదాయ పద్ధతిలో పాటిస్తారు. గిరిజనులు ఐక్యంగా ఉండేందుకు ఈ పండగ ఎంతో ఉపయోగపడుతుంది. సాయింత్రం అంత ఒకచోటచేరి, థింసా నృత్యాలతో ఆనందంగా గడుపుతాం.

–గురుమూర్తి, కించుమండ

జాలంపల్లిలో రెండు పూరిళ్లు దగ్ధం

రూ.2 లక్షల ఆస్తి నష్టం

మాడుగుల: మండలంలో జాలంపల్లి ఎస్సీ కాలనీలో శనివారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తూ జరిగిన ఆగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధం అయ్యాయి. సుమారు 2 లక్షల రూపాయలు మేర ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన బుంగా పార్వతి, డోంకా దేముడమ్మ, పూరిల్లు పూర్తిగా కాలిపోయాయి. ఇరువురు బాధితులు పూర్తిగా నిరాశ్రయులయ్యారు. ఇంట్లో నిత్యావసర వస్తువులు, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న సర్పంచ్ జి. దారమల్లేశ్వరి, చిన్ని సంఘటన స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు దృష్టికి తీసుకొచ్చారు. ఆయన ఆదేశాల మేరకు బాధితులకు 25 కిలోలు చొప్పున బియ్యం, నిత్యావసర వస్తువులు, దుస్తులతో పాటు సర్పంచ్ దారమల్లేశ్వరి చిన్ని సొంత నగదును బాధితులకు ఆదివారం అందజేశారు. ఆర్ఐ నాగేశ్వరావు, వీఆర్వో సంఘటన స్థలాన్ని సందర్శించి ఆస్తి నష్టం వివరాలు సేకరించారు.



జాలంపల్లిలో బాధితులకు బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తదితరులు

ఊరంతా గాదెలే..

అనంతగిరి: గిరిజనులు ధాన్యం పండించడం ఒక ఎత్తయితే దానిని భద్రపరుచుకోవడం మరో ఎత్తు.. గిరిజన పూర్వీకులు విభిన్నంగా ఆలోచించి, మట్టితో నిర్మించిన గాదెలోనే ధాన్యాన్ని భద్రపరిచేవారు. దీనిని ఆదర్శంగా తీసుకుని ప్రస్తుతం మండలంలోని పలు పంచాయతీల్లో గిరిజనులు ఈ పద్ధతినే పాటిస్తున్నారు. భీంపోల్ పంచాయతీ కేంద్రంలోని ఊరంతా గిరిజనులు తమ ఇంటి ముందు, మట్టితో నిర్మించిన గాదెలను ఏర్పాటు చేసుకుని, ధాన్యాన్ని భద్రపరుచుంటున్నారు. ప్రస్తుతం గిరిజనులు రెండో పంటపై దృష్టి సారించి, ఇప్పటికే పలు గ్రామాల్లో పొలాలు వద్ద వరి నాట్లు పనుల్లో గిరిజన మహిళలు నిమగ్నమయ్యారు.



భీంపోల్ గ్రామంలో గాదెల్లో ధాన్యాన్ని భద్రపరుచుకుంటున్న గ్రామస్తులు

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

ఉమ్మడి జిల్లా 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు

అనకాపల్లి రూరల్: పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు తమకు పోస్టింగ్ ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మేలును తాము బతికున్నంతవరకూ మరిచిపోలేమని ఉమ్మడి విశాఖ 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు తెలిపారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఉమ్మడి విశాఖలో 1998 డీఎస్సీ ద్వారా అర్హత సాధించిన అభ్యర్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంపికైన అభ్యర్థులు ఈ సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా తమకు సీఎం జగన్మోహన్ రెడ్డి ఎంతో మేలు చేశారన్నారు. ఇందుకు సీఎంకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.తమ సమస్యను గుర్తించడమే కాకుండా పరిష్కరించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి తామంతా అండగా ఉంటామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తమకు పోస్టింగ్ ఇవ్వడానికి నిర్ణయిస్తూ జీవో జారీ చేయడంపై పలువురు అభ్యర్థులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ టీచర్ కావాలన్న తమ చిరకాల కోరిక సీఎం జగన్ వల్లే నెరవేరిందని చెప్పారు.సీఎం ఆకాంక్షల మేరకు కష్టపడి పనిచేస్తామన్నారు.ఈ సందర్భంగా పలువురు సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. డి.అప్పారావు, పి.అప్పలరాజు,పి.శ్రీనివాసరావు, ఆర్.సీతయ్య దొర,కె.రమణ, ఎన్.సత్తిబాబు,డి అప్పలనాయుడు,వివిధ మండలాల నుంచి వచ్చిన క్వాలిఫైడ్ అభ్యర్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులు

లలితా పీఠంలో సంకటహర చతుర్థి



గణపతికి పూజలు చేస్తున్న అర్చకులు



లక్ష్మీగణపతి హోమం చేస్తున్న పండితులు

సీతంపేట: సంకటహర చతుర్థి సందర్భంగా ఆదివారం లలితానగర్ లలితా పీఠంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. గణపతికి ప్రీతిపాత్రమైన తిధుల్లో చతుర్థి ఒకటని, కష్టాల నుంచి గట్టెక్కించే సంకటహర చతుర్థి వ్రతం ఎంతో విశిష్టమైనదని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ తెలిపారు. పీఠం అర్చకుల మంత్రోచ్ఛారణల మధ్య దూప దీప నైవేద్యం, గణేశ స్తోత్రం, వ్రత కథ చదివారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో శాస్త్రోక్తంగా గణపతి హోమం చేశారు. ఈ హోమం వల్ల కార్యసిద్ధి, ఆరోగ్యం, విజయం లభిస్తాయని అర్చకులు తెలిపారు.

నేడు వారాహి హోమం : బహుళ పంచమి సందర్భంగా సోమవారం సాయంత్రం 6.30 గంటలకు లలితా పీఠంలో వారాహి హోమం జరుగుతుందని కృష్ణసేస్ చెప్పారు. సీతంపేట కూడలిలోని దుర్గాగణపతి ఆలయం, శంకరమఠం రోడ్‌లోని విజయ గణపతి ఆలయంలో సంకటహర చతుర్థి పూజలు చేశారు.

చందనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

- కొండ దిగువనే ప్రసాద విక్రయాలు
- ప్రత్యేకాధికారి ఆజాద్

సింహాచలం: ఈ నెల 23న చందనోత్సవం పురస్కరించుకుని సింహగిరిపై జరుగుతున్న ఏర్పాట్లను దేవదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్, ఉత్సవ ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ ఆజాద్ ఆదివారం పరిశీలించారు. భక్తుల దర్శన క్యూల్లో చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలిచ్చారు. చందనోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని ఈ సందర్భంగా ఆజాద్ తెలిపారు. ఈసారి ప్రసాద విక్రయాలు పూర్తిగా కొండ దిగువే పెట్టేందుకు యోచన చేస్తున్నామని చెప్పారు. చందనోత్సవంలో సామాన్య భక్తులకే పెద్ద పీట వేస్తామన్నారు. దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు శ్రీనివాసరాజు, రాంబాబు ఆజాద్‌కు ఏర్పాట్లను వివరించారు.



సింహగిరిపై ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆజాద్

అన్నదాతా సుఖీభవ

ఎవరూ ఆకలితో ఉండరాదన్న ఆశయంతో విశాఖకు చెందిన హరేకృష్ణ మూవ్‌మెంట్, టచ్‌స్టోన్ చారిటీస్ ఆధ్వర్యంలో సుభోజనం పేరిట రోగులు, వారి సహాయకులకు చక్కటి భోజనం అందిస్తున్నారు. వైద్యసేవల పరంగా ఉత్తరాంధ్ర జిల్లాలకు పెద్ద దిక్కుగా ఉన్న కింగ్ జార్జి ఆస్పత్రిలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి నిత్య సేవ చేస్తున్నారు. దాతల చేయూత లేని రోజుల్లో రూ. 30 వసూలు చేస్తున్నారు. కేజీహెచ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కౌంటర్ 11 వసంతాలు పూర్తి చేసుకుంది.



కేజీహెచ్ సుభోజనం కౌంటర్‌లో రోగుల సహాయకులకు భోజనం సరఫరా

- 11 ఏళ్లుగా కేజీహెచ్ రోగుల సహాయకులకు 'సుభోజనం'
- హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నిత్యసేవ

మహారాణిపేట : హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆశ్రమాలకు 10 కిలోమీటర్ల పరిధిలో ఏ ఒక్కరూ ఆకలితో ఉండరాదన్న సదాశయంతో 2011 నవంబర్ 21న నాటి ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్, అప్పటి కలెక్టర్ లవ్ అగర్వాల్, జిల్లా జాయింట్ కలెక్టర్ గిరిజా శంకర్ కేజీహెచ్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యవస్థాపక గురువు శ్రీల భక్తి వేదాంత స్వామి ప్రభుపాదుల ఆశయాలకు అనుగుణంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కేజీహెచ్‌లో ఈ కౌంటర్ ప్రారంభించక ముందు అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనానికి రోగుల సహాయకులకు ఎంత తక్కువలో చూసుకున్నా ప్రతి రోజూ రూ.150 వరకు ఖర్చు అయ్యేది. ఈ పరిస్థితిని గమనించిన హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆస్పత్రి ఆవరణలో ఈ సదుపాయం ప్రారంభించి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి ఉచితంగా భోజనం అందిస్తోంది. సంవత్సరంలో 365 రోజులు ఈ సదుపాయాన్ని కొనసాగిస్తోంది.

మేము సైతం అంటున్న పూర్వ విద్యార్థులు

ఈ కార్యక్రమం గురించి తెలుసుకున్న కేజీహెచ్ పూర్వ వైద్య విద్యార్థులు డాక్టర్ రవి, శేషశర్మ ఆంధ్ర వైద్య కళాశాల శతాబ్ది వేడుకల సందర్భంగా ప్రతి రోజూ ఉచితంగా 400 మందికి ఒక్క సంవత్సరం భోజన వితరణ చేయాలని నిర్ణయించుకున్నారు. తమ తల్లితండ్రులు వడ్లమాని అన్నపూర్ణేశ్వరరావు, పద్మావతి గౌరవార్థం ఏడాది పాటు రోజుకు 400 మందికి భోజనాలకు అయ్యే ఖర్చును భరించారు.

మెనూ ఇలా..

సుభోజనం ద్వారా ఉదయం ఇడ్లీ, ఉప్మా, మధ్యాహ్నం అన్నం, కూర, సాంబారు, మజ్జిగ, రాత్రి కూడా మధ్యాహ్నం లాగే అందజేస్తున్నారు. ప్రతి రోజూ 1000 నుంచి 1200 మందికి భోజనం పెడుతున్నారు. దాతల సహకారంతో నెలలో 20 నుంచి 25 రోజులు ఈ కార్యక్రమం కొనసాగుతుండగా.. మిగిలిన రోజుల్లో హరేరామ హరేకృష్ణ మూవ్‌మెంట్ వారే నిర్వహిస్తున్నారు. ఇందులో పలువురు కేజీహెచ్ వైద్యులు కూడా ఈ సేవలో భాగస్వాములయ్యారు.

సహాయకుల ద్వారా ప్రచారం



ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందుతున్న రోగి సహాయకుల నుంచి విస్తృత ప్రచారం లభిస్తోంది. పలువురు దాతలు ముందుకు వచ్చి ఉచితంగా ఆహారం అందిస్తున్నారు. వారి ఇళ్లలో జరిగే పుట్టిన రోజులు, పెళ్లిళ్ల, పెళ్లి రోజులు, ఇతర కార్యక్రమాల సమయంలో రోగి సహాయకులకు ఉచితంగా ఆహారం అందిస్తున్నారు. ఇలా నెలలో సుమారు 20 రోజుల పాటు సేవలు కొనసాగుతున్నాయి. ఉచిత భోజన వితరణ కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలందరికీ కృతజ్ఞతలు. మరిన్ని వివరాలకు యదు రాజదాస (9010611108), జీతమిత్ర దాస (8184887108)లను సంప్రదించాలి.

–డాక్టర్ నిష్కించిన భక్తదాస, అధ్యక్షుడు, హరేకృష్ణ మూవ్‌మెంట్, టచ్‌స్టోన్ చారిటీస్

సేవకు వయసుతో సంబంధం లేదు



సేవ చేయాలని ముందుకు వచ్చాను. వైద్య ఆరోగ్యశాఖలో పని చేసి రిటైర్ అయ్యాను. హరేకృష్ణ మూవ్‌మెంట్ చేపడుతున్న ఈ కార్యక్రమంలో భాగం అయ్యాను. నాకు 70 ఏళ్లు. 11 ఏళ్లుగా కేజీహెచ్ సుభోజనం కౌంటర్ వద్దకు వచ్చిన వారికి భోజనాలు వడ్డిస్తున్నాను. –పిల్లల షణ్ముఖరావు, స్వచ్ఛంద సేవకుడు

భోజనం ఎంతో బాగుంది



నా భార్యకు ఒంట్లో బాగులేక కొద్ది రోజుల క్రితం కేజీహెచ్‌లో చేర్పించాను. ఆమెకు తోడుగా ఉన్న నేను రోజూ ఇక్కడ భోజనం చేస్తున్నాను. భోజనం బాగుంది. నిర్వాహకులకు ధన్యవాదాలు. – వంతల పాండురాజు, నిమ్మలపాలెం, కొయ్యూరు మండలం, ఏఎస్ఆర్ జిల్లా

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ CRASH COURSE for EAMCET, NEET and MAINS by top Class in Lecturers. Contact : 96664 66000 [V-10383]

SUMMER COURSES

■ సమ్మర్ కోర్సులు : M.S. Office, Tally, C, C++, సెల్ రిపేరింగ్, బ్యూటీషియన్, టైలరింగ్, మాంటిస్సోరీ కోర్సులకు అడ్మిషన్లు రాజీవ్ ఇనిస్టిట్యూట్. ఫోన్: 94403 01948 [V-2706]

Real Estate

PLOT FOR SALE

■ అచ్యుతాపురం దుప్పెటర్రు గ్రామం శేషసాయి వెంచర్‌లో ప్లాటు నం. 60, 249 చ.గ. ఓపెన్ ప్లాట్ అమ్మకానికి కలదు. డైరెక్ట్ పార్టీలు సంప్ర: 6305900539, 9440554000 [H-781565]

Services

BUSINESS OFFER

■ Globale avanu కంపెనీకి ప్రాతినిధ్యం వహించడానికి ఆంధ్రప్రదేశ్ & తెలంగాణలలో కనీస అర్హతను కల్గి మంచి నైపుణ్యం కలిగిన ఏజెంట్స్ కావలెను. మంచి జీతం & Incentives. ✆ 7428038734 [T-1201073]

Wanted

■ WELLNES COACH గా పార్ట్ / ఫుల్‌టైం పనిచేస్తూ అధిక ఆదాయం పొందండి. ఈ బిజినెస్ సెమినార్ ఇప్పుడు వైజాగ్‌లో. వివరాలకు సంప్రదించండి : 63050 20736 [V- 776918]

■ Required Duty Doctors for Clinic at Anadhapuram. Min Qualifications :- MBBS, Min exp :- 3 years in Emergency or General Practice. Min salary: 35k (added salary on each exp years). Timings : Mng 9.30- 01 pm, Evng : 06- 09pm. Contact Prop. 9912411123 [V- 776917]

■ Receptionist & Computer Operator (F), Lab technicians (MLT), Sampath Medi care, Coromandal Bus Stop, Sriharipuram. Ph : 72879 67999 [V-778246]

■ విక్రాంత్ సెక్యూరిటీ : అచ్యుతాపురం, దువ్వాడ VSEZలో పనిచేయుటకు 10th పాసైన 35-40 సం॥ల యువకులు సెక్యూరిటీ గార్డులుగా కావలెను. జీతం + ESI, PFతో కలిపి రూ. 15,000/-. ఫోన్ : 91001 03011, 63661 82757 [V- 1812]

■ Wanted welders, Fritters. Grinders Free Accommdoation. Job Location : Chennai perambur. Office Location : Dabagarden, Vizag. Ph : 90324 56763 [V- 36465]

■ గవర్నమెంట్, ప్రైవేట్ సంస్థల్లో సెక్యూరిటీ గార్డులు, ఫీల్డ్ ఆఫీసర్, హౌస్ కీపింగ్, క్లీనింగ్ పనివారు కావలెను. జీతం : 10-20వేలు, PF, ESI, రూమ్, భోజనం, 5 లక్షల ఇన్సూరెన్స్, Contract Jobs. RSR. ఫోన్: 77029 59468 [V-1808]

■ గుంటూరు నందు చికెన్ షాపులో అనుభవం గల కట్టింగ్ డ్రస్సింగ్ వచ్చిన వారు అర్జంట్‌గా కావలెను. జీతం: 15,000/-రూమ్+భోజనం ఫ్రీ. సంప్ర॥ 9553715528, 8142311488 [G-795443]

■ మ్యాన్ పవర్ & సెక్యూరిటీ ఫీల్డ్‌లో అనుభవమున్న ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. Contact : Mega Group Man Power & Security. Cell : 70326 10569, 70931 25169. [NA-5483]

■ పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు పాండురంగా మెగా ఎక్స్‌ట్రీమ్‌సిటీ నందు పనిచేయడానికి యువకులు కావలెను. జీతం+ఉచిత భోజనం+టిఫిన్ + రూమ్ వసతి కలదు. 9490165188, 7569852204 [HA-30]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం, జీ: 16K-18K విజయవాడ. ఫోన్: 9640528899, 9640648899 [H-793409]

■ మల్టీఫుల్ ఆగ్రో సంస్థ నందు ఇంటి వద్దనే ఉండి జాబ్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. పార్ట్/ఫుల్ టైం. జీతం.18వేలు-25వేలు, అర్హత: 10th, మొబైల్ ఫ్రీ, జెన్యూన్‌జాబ్. 9959152161 [G-6673]

■ Wanted Marketing Team Leaders, Female Telecallers, Class incharges, Counsellors. Salary Upto: 16,000/-. Any Degree, Age: 25 to 45. Job Location: Vizag. Contact: 9248733325 / 9248713330 [G-4161]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

వేటకు విరామం

ఎండలు తీవ్రంగా ఉండే ఏప్రిల్ నుంచి జూన్ వరకు సముద్ర ఉపరితల జలాలు కూడా వేడెక్కుతాయి. దీంతో చేపలు గుడ్లు పెట్టేందుకు సముద్ర జలాల్లోపలికి వెళతాయి. అక్కడ వాతావరణం చల్లగా ఉండి, గుడ్లు పెట్టేందుకు అనుకూలం. గుడ్లు పిల్లలుగా మారి, పెరిగేందుకు కనీసం రెండు మాసాలు పడుతుంది. జూన్‌లో రుతుపవనాల రాకతో వాతావరణం చల్లబడి, చేపలు మళ్లీ పైకి వస్తాయి. అందుకే ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు తూర్పు తీరంలో చేపల వేటపై నిషేధం అమలవుతుంది. ఈ మేరకు అనకాపల్లి జిల్లాలో కూడా వేట నిషేధంపై మత్స్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.





ఒడ్డున లంగరు వేసిన బోట్లు, (ఇన్‌సెట్) వలతో పట్టిన చేపల్ని మోస్తున్న మత్స్యకారులు

- 14 అర్ధరాత్రి నుంచి వేట నిషేధం
- మత్స్య సంపద పెంపునకు అమలు
- జూన్ 15 నుంచి వేట మళ్లీ మొదలు
- జిల్లాలో 12 వేల మత్స్య కుటుంబాలు
- ప్రభుత్వం నుంచి రూ.10 వేలు భృతి

అచ్యుతాపురం(అనకాపల్లి) : గంగపుత్రులు వేటకు విరామం చెప్పే సమయం వచ్చింది. నిత్యం సముద్రంలో వేట సాగించే వీరు రెండు నెలల పాటు విశ్రాంతి తీసుకోనున్నారు. మత్స్యసంపద ప్రత్యుత్పత్తికి అనుకూల సమయం కావడంతో ఈ రెండు మాసాలు మెకనైజ్డ్ బోట్లతో చేపల వేటపై నిషేధం తప్పనిసరి. సముద్రంలో మత్స్య సంపద పెరిగేందుకు దశాబ్దాల నుంచి ఈ విరామం అమలులో ఉంది.

14 అర్ధరాత్రి నుంచి అమలు...

ఈ నెల 14 అర్ధరాత్రి నుంచి సముద్రంలో చేపల వేటను మత్స్యకారులు నిలిపివేస్తారు. ముఖ్యంగా మెకనైజ్డ్(మర) బోట్లను ఒడ్డునే లంగరు వేస్తారు. ఈ రెండు నెలల కాలంలో చేపలు సముద్రం లోపల గుడ్లను పెడతాయి. ఈ సమయంలో వేట చేస్తే చేపల సంతానోత్పత్తి ఆగిపోతుంది. తద్వారా వారికే నష్టం కలగనుంది. ఈ కారణంగా జూన్ 15 వరకూ వేటకు వెళ్లకుండా మత్స్యకారులు ఇంటి వద్దే ఉండిపోతారు. ఈ సమయంలో బోట్లకు మరమ్మతులు, రంగులేయడం, వలల్ని బాగు చేసుకోవడం తదితర పనుల్లో వీరు బిజీగా ఉంటారు.

ఏటా 44 వేల టన్నుల మత్స్య సంపద

అనకాపల్లి జిల్లా పరిధిలో 73 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. ఈ తీరం పరిధిలోని ఆరు మండలాల్లో 31 మత్స్యకార గ్రామాలున్నాయి. దాదాపు 12 వేల కుటుంబాలు పూర్తిగా చేపల వేట, విక్రయంపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. జిల్లా నుంచి ఏటా 44 వేల టన్నుల మత్స్య సంపద దేశవిదేశాలకు ఎగుమతి అవుతోంది. మత్స్యవేటలో ఎన్ని ఇబ్బందులున్నా.. గంగ పుత్రులకు ఇదే జీవనాధారం. ఇటీవల కాలంలో చేపలకు డిమాండ్ పెరిగింది. రుచితో పాటు, ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్యుల సూచనతో చేపలను ఆహారంగా తీసుకుంటున్నారని మత్స్యకారులు చెప్తున్నారు. చందువా, ట్యూనా వంటి చేపల్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. చెన్నై, కొచ్చిన్, ముంబయి వంటి ప్రాంతాలకూ.. జిల్లా నుంచి మత్స్య సంపద సరఫరా అవుతోంది.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

వేట నిషేధ సమయంలో మత్స్యకారుల జీవన భృతి కోసం 2019 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది. గత ఏడాది అనకాపల్లి జిల్లా పరిధిలో 10,244 మందికి రూ.10 వేలు చొప్పున పరిహారం అందించారు. మెకనైజ్డ్ బోట్లకు ఆరుగురు చొప్పున, మామూలు బోట్లకు ముగ్గురు చొప్పున పరిగణలోకి తీసుకొని లబ్ధిదారుల్ని గుర్తిస్తారు. వీరికి మే నెలలో పరిహారం అందిస్తారు. నేరుగా మత్స్యకారుల బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేస్తారు. జిల్లాలో 12 వేల మత్స్య కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది.

వేట నిలిపివేయాలి

ఈ నెల 14 అర్ధరాత్రి నుంచి మత్స్యకారులు వేట నిలిపివేయాలి. జూన్ 15 అర్ధరాత్రి నుంచి వేట మొదలు పెట్టుకోవచ్చు. నిషేధ సమయంలో పరిహారం అందిస్తాం. చేపల సంతానోత్పత్తి ప్రక్రియ మత్స్యకారుల జీవితాలకు కూడా కీలకం. మత్స్య సంపద పెరిగేందుకు ఈ రెండు మాసాల విరామం ప్రధానమైనది.

– లక్ష్మణరావు, జేడీ, మత్స్య శాఖ